సాక్షి
కర్నూలు
శనివారం : 4 : ఫిబ్రవరి : 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన వెల్లంపల్లి రామకృష్ణా రెడ్డి రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



శ్రీమఠంలో మహారాష్ట్ర భక్తులు

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు మహారాష్ట్రలోని ఠాణెకు చెందిన దేవేంద్రనాథ్‌సేవా మండలి సభ్యులు 500 మంది మంత్రాలయం వచ్చారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,615.52
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:49.664
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,546

న్యూస్‌రీల్

విత్తన ప్లాంట్ల తనిఖీలకు మూడు బృందాలు

కర్నూలు(అగ్రికల్చర్): పత్తితో పాటు ఇతర విత్తనాల ప్రాసెసింగ్ ప్లాంట్ల తనిఖీలకు మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్ల తనిఖీలకు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ కే.అరుణకుమారి, ఏవో ఏ.మాధురి, కల్లూరు మండల పరిధిలోని విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్‌ల తనిఖీలకు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవో బి.శశిధర్‌రెడ్డి, ఆదోని, కోసిగి మండలాల్లోని ప్లాంట్‌ల తనిఖీలకు ఎమ్మిగనూరు పీడీ అండ్ డీఎఫ్ ఏడీఏ అరుణలత, ఏవో రామకృష్ణలతో బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఆదోని ఈఈ బదిలీ

కర్నూలు(అర్బన్): గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.శంకర్‌బాబు చిత్తూరుకు బదిలీ అయినట్లు ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ బి. నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరులో ఎస్ఈ(ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న కేవీ నాగజ్యోతిని ఆదోనికి బదిలీ చేశారన్నారు. ఆదోని నుంచి చిత్తూరుకు బదిలీ అయిన శంకర్‌బాబు తదుపరి ఉత్తర్వులు అందే వరకు అక్కడ ఎఫ్ ఏసీ ఎస్ఈగా విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఆర్‌వీ క్రిష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)–2023కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్న పరీక్షకు మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేశామని.. 3,601 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్స్, పరీక్షా కేంద్రానికి సంబంధించిన మెటీరియల్ అంతా జిల్లాలోని సంబంధిత పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లలో భద్రపర్చామన్నారు. పరీక్షకు 16 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 16 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇద్దరు రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, బోధనేతర సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 27 మంది హాజరు



గ్రీవెన్స్‌డేలో సమస్యలు విన్నవిస్తున్న సిబ్బంది

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్‌డేకు 27 మంది సిబ్బంది హాజరయ్యారు. మెడికల్, రిక్వెస్ట్ బదిలీలు, స్పౌజ్ కేసులకు సంబంధించిన సమస్యలపై విన్నవించగా తగిన పరిష్కారం చూపుతానని సిబ్బందికి ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ మానుకోకపోతే పీడీ చట్టం

- సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

కర్నూలు: ప్రజారోగ్యానికి హాని కలిగించే నాటు సారా తయారీ, రవాణా మానుకోకపోతే పీడీ చట్టం అమలు చేస్తామని సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ హెచ్చరించారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాటు సారా నిర్మూలనకు పోలీసులు సమష్టిగా కృషి చేస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాటుసారా స్థావరాలపై నెల రోజులుగా దాడులు నిర్వహించి 38 కేసులు నమోదు చేసి 61 మందిని అరెస్టు చేసి 843 లీటర్ల నాటుసారా, 510 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 450 కేజీల సారా బెల్లం సీజ్ చేసి ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేసి ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక నుంచి జిల్లాలకు మద్యం రవాణా చేస్తున్న వారిపై నిఘా ఉంచి 122 కేసులు నమోదు చేసి 148 మందిని అరెస్టు చేసి 3,100 లీటర్ల మద్యం, 30 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా రవాణాదారులు 12 మందిని, మద్యం అక్రమ రవాణాదారులు 14 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. షరతులను ఉల్లంఘించిన (బ్రీచ్ ఆఫ్ బాండ్) ముగ్గురిపై బాండ్లు జప్తు చేసి రూ.26 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. స్పెషల్ పార్టీ పోలీసులు నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నారని, మద్యం, సారా అక్రమ రవాణా విక్రయాలకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కడప సెంట్రల్ జైలుకు పంపనున్నట్లు తెలిపారు.

అమృతజలం



మినరల్ వాటర్ ప్లాంట్



మొలగవల్లిలోని పెద్దబావి



పెద్దబావిలో పూడిక తీస్తున్న గ్రామస్తులు (ఫైల్)

సందుకో వాటర్ ప్లాంట్.. కూల్‌డ్రింక్ దుకాణాల్లోనూ వాటర్ ప్యాకెట్లు.. బ్రాండెడ్ కంపెనీ బాటిల్ కొని నీళ్లు తాగనిదే కొందరికి గొంతు తడారదు. ఎక్కడికెళ్లినా వాటర్ క్యాన్లను వెంట పెట్టుకుని వెళ్తున్న జనం కోకొల్లలు. 'స్వచ్ఛత' ముసుగులో నీటి వ్యాపారం 'కోట్లు' దాటుతోంది. ఇలాంటి ఈ రోజుల్లోనూ ఆ ఊరి జనానికి ఓ బావి నీరు అమృతంతో సమానం. ఊళ్లో వాటర్ ప్లాంట్‌లు ఉన్నా, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించినా.. ఆ నీటితోనే గొంతు తడుపుకోవడం చూస్తే ఆ గ్రామానికి బావితో ఉన్న అనుబంధం ఇట్టే అర్థమవుతుంది.

ఊరు: మొలగవల్లి / జనాభా: 10వేలు / ఎక్కడ: ఆలూరుకు 15కిలోమీటర్ల దూరం

కుళాయి కనెక్షన్లు: 7వేలు / మినరల్ వాటర్ ప్లాంట్‌లు: 2 / ఓహెచ్‌ఆర్ ట్యాంకులు: 4

మొలగవల్లిలో నాలుగు శతాబ్దాల బావి

- తరతరాలుగా పెనవేసుకున్న బంధం
- శుభకార్యాల సందర్భంగా గంగమ్మకు పూజలు
- ఇంటికో కుళాయి ఉన్నా తాగేందుకు బావి నీరే..
- ఇతర అవసరాలకే మినరల్ వాటర్
- ఇదే బావిలో మరో చేదుడు బావి



మొలగవల్లి గ్రామం

ఆలూరు రూరల్: పట్టణాల సంగతి పక్కనపెడితే.. వాటర్‌ప్లాంట్ కనిపించని గ్రామం ఉండదంటే అతిశయోక్తి కాదు. పక్కనే వాగులు, వంకలు పారుతున్నా.. సెలయేళ్లు ఉరుకుతున్నా.. బావులు అందుబాటులో ఉన్నా.. ఇప్పుడు అందరి అడుగులు వాటర్‌ప్లాంట్ వద్దే ఆగుతున్నాయి. ఐఎస్ఐ మార్కు లేకపోయినా, మినరల్స్ ఏస్థాయిలో ఉంటున్నాయో తెలియకపోయినా.. ప్లాంట్ ముందు ఏర్పాటు చేసిన కుళాయి ముందు బిందెలు బారులు తీరుతున్నాయి. ఐదు, పది రూపాయలు.. మరికొన్ని చోట్ల 20 రూపాయలు వెచ్చించి కూడా కొనుగోలు చేస్తున్నారు. ప్రకృతి సహజసిద్ధంగా లభ్యమవుతున్న నీటిని కాదని.. కోరి మరీ రోగాలను కొంటున్నారు. అయితే మండలంలోని మొలగవల్లి గ్రామం ఇప్పటికీ బావి నీటితోనే దాహం తీర్చుకుంటోంది. మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఈ గ్రామంలోకి అడుగు పెట్టినా.. తాగునీరు మాత్రం ప్రతి ఇంటికీ ఈ బావి నీరు ఉండాల్సిందే. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు శతాబ్దాలుగా ఈ బావి ప్రతి ఇంటికి అమృతం అందిస్తోంది.

ఆ బావి నీళ్లే మినరల్ వాటర్

గ్రామంలో రెండు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా ఉంది. నాలుగు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించారు. 7వేల వరకు ఇంటింటి కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ గ్రామస్తులు తాగునీటికి మాత్రం ఆ బావి నీళ్లనే వినియోగిస్తున్నారు. రోజు ఈ నీటిని తాగుతున్న స్థానికులు ఏదైనా పని మీద ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి నీరు తాగితే ఒళ్లు నొప్పులు, అనారోగ్య సమస్యలు వస్తాయని చెబుతారు. ఇక ప్రధానంగా అన్నం, పప్పు వండటానికి ఈ నీళ్లు అయితే బాగా ఉడుకుతాయని, ఇతర ఏ నీళ్లు అయినా సరిగా ఉడకవని, తిన్నట్లుగా కూడా ఉండదంటారు.

పెద్దబావిలోనే.. చేదుడు బావి..

నాలుగు వందల ఏళ్ల క్రితం మొలగవల్లి గ్రామంలోని చెరువు పక్కన గ్రామస్తుల తాగునీటి అవసరాలకు ఓ పెద్ద బావి నిర్మించారు. దాదాపు రెండు వందల ఏళ్ల తర్వాత బావిలో నీరు ఇంకిపోవడంతో అప్పట్లో గ్రామస్తులు చిప్పలతో నీళ్లను తోడుకునే వారని వయసు మళ్లిన వాళ్లు చెబుతుంటారు. తాగునీటి ఇబ్బందుల దృష్ట్యా వందేళ్ల క్రితం పెద్ద బావిలోనే స్థానికులు మరో చేదుడు బావిని తవ్వుకున్నారు. చిన్న బావి నిర్మించుకున్న తర్వాత ఎనిమిదేళ్ల క్రితం నీటిని బయటికి తోడి పెద్దబావిలో పూడిక తొలగించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది వారానికి ఒకసారి తాగునీటి బావిలో బ్లీచింగ్ పౌడర్ కలుపుతుంటారు. శుభకార్యాల వేళ గ్రామస్తులు పెద్దబావి వద్దకు వెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

పెద్దబాయి నీళ్లు అమృతంతో సమానం



నా వయసు 76ఏళ్లు. మా అవ్వతాతల కాలం నుంచి మాకు ఈ బాయి నీళ్లు అమృతంతో సమానం. బయటి నీళ్లు తాగితే కాళ్ల నొప్పులు, దగ్గు, పడిశం వస్తుంది. ఇంక వంట చేయనీక ఈ నీళ్లు అయితేనే బ్యాళ్లు, బియ్యం బాగా ఉడుకుతాయి. మా ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా గంగమ్మకు పూజలు చేయాల్సిందే.

– గౌరమ్మ, వృద్ధురాలు, మొలగవల్లి

బయటి నీళ్లు తాగితే అనారోగ్యం



గ్రామంలో వాటర్‌ప్లాంట్‌లు పెట్టినా, కుళాయిలు ఉన్నా మాకు ఈ బావి నీళ్లు తాగితేనే గొంతు తడారుతుంది. మినరల్ వాటర్ కన్నా ఈ నీళ్లు ఎంతో రుచిగా ఉంటాయి. బయటి ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి నీళ్లు తాగితే ఒంట్లో ఏదో ఒక సమస్య వస్తుంది. గ్రామానికి సరఫరా అవుతున్న నీటిని ఇంటి అవసరాలకు వినియోగిస్తాం.

– శ్రీరాములు, మొలగవల్లి

బావితో మాకు ఎంతో అనుబంధం



మా తాతల కాలం నుంచి ఈ బావితో మాకు అనుబంధం ఉంది. బయటి ప్రాంతాల్లో చిన్న వయస్సుకే మోకాళ్ల నొప్పులు, ఆ రోగం, ఈ రోగం అంటుంటారు. మాకు మాత్రం ఈ నీళ్లు తాగితే ఏ నొప్పులు ఉండవు. వ్యాపారం కోసం మినరల్ వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసినా మేము మాత్రం బావి దగ్గరకు పోయి నీళ్లు తెచ్చుకునేందుకే ఇష్టపడతాం.

– రామాంజినేయులు, మొలగవల్లి

విదేశాల్లో చదువుకు ప్రభుత్వ చేయూత

- జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు



జగనన్న విదేశీ విద్యా దీవెన చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్ తదితరులు

కర్నూలు(అర్బన్): జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం ఆర్థిక చేయూత ఇస్తోందని జిల్లా కలెక్టర్ పీ కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యా దీవెన మొదటి విడత ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లోకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లోని ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్లు, మిగిలిన వారికి గరిష్టంగా రూ.కోటి వరకు వంద శాతం ట్యూషన్ ఫీజును రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. అలాగే 100 నుంచి 200 ర్యాంకులు పొందిన యూనివర్సిటీలకు ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు గరిష్టంగా రూ.75 లక్షలు, మిగిలిన విద్యార్థులకు గరిష్టంగా రూ.50 లక్షలు లేదంటే ట్యూషన్ ఫీజులో 50 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందన్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు వారు ఎంచుకున్న కోర్సు పూర్తి చేసుకునేలా నాలుగు వాయిదాల్లో స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షలు ఉండేదని, ప్రస్తుతం దాన్ని రూ.8 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం కింద కింద విడుదలైన రూ.8.80 లక్షలకు సంబంధించిన మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, బీసీ , గిరిజన సంక్షేమ, సాధికారత అధికారులు ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి, పీ వెంకటలక్ష్మమ్మ, ఎస్ శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది దేవనకొండ మండలం పొట్లపాడు గ్రామం. మాకు ఉన్న మూడు ఎకరాల మెట్ట భూమిలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాం. మా కూతురు హిమవర్ష కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ చదువుతోంది. యూనివర్సిటీ ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తోంది. మొదటి విడతగా ఆర్థిక సాయాన్ని మా బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. జగనన్నకు రుణపడి ఉంటాం.

– హిమవర్ష తల్లిదండ్రులు మేరీ కుమారి, ప్రసాద్

సృజన వేదిక.. వైజ్ఞానిక ప్రదర్శన

- నేడు కర్నూలులో జిల్లా స్థాయి ప్రదర్శన
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ రంగారెడ్డి

కర్నూలు సిటీ: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచి.. వారి ఆలోచనలకు సానపెట్టి.. నూతన ఆవిష్కరణలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తోంది. కర్నూలు నగరంలోని ప్రభుత్వ(టౌన్ మోడల్)ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శన తిలకించేందుకు ఉదయం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, మధ్యాహ్నం ప్రైవేటు స్కూల్ విద్యార్థులను అనుమతించనున్నారు. ఎంపిక చేసిన ప్రాజెక్టులను తయారు చేసిన విద్యార్థులు, వారి గైడ్ టీచర్లు ప్రదర్శనకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

పాఠశాల స్థాయి నుంచే ప్రదర్శనలు

జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలలు 2,241 ఉన్నాయి. ఇందులో 527 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థుల్లో సహజంగా ఉండే బెరుకును పోగొట్టడానికి తొలుత తోటి విద్యార్థుల మధ్యనే పాఠశాలల్లో గతేడాది నవంబరు 22, 23 తేదీల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పర్యావరణ హిత పదార్థాలు, ఆరోగ్యం-పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ యాప్స్, పర్యావరణ సమస్యలు-వాతావరణ మార్పులు, గణిత శాస్త్ర నమూనాలు అనే అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో మండల స్థాయికి ప్రతి అంశంపై ఐదు ప్రాజెక్టుల చొప్పున ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టులను గతేడాది డిసెంబర్ 12, 13 తేదీల్లో మండల స్థాయి ప్రదర్శలో ఉంచారు. వీటిలో ఉత్తమమైన వాటిని ఒక్కో అంశం నుంచి ఒకటి చొప్పున జిల్లా స్థాయికి 25 మండలాల నుంచి 125 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వీటితో శనివారం జిల్లా స్థాయి ప్రదర్శన నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రతి అంశం నుంచి ఉత్తమమైన వాటిని రెండింటిని ఎంపిక చేయనున్నారు. ఈ నెల 28న జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భగా విజయవాడలో రాష్ట్ర స్థాయి ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందులో ఉత్తమమైన ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందించనున్నారు.

మరో 113 ఆర్‌బీకేల్లో సీహెచ్‌సీల ఏర్పాటు

- మార్చి 3లోపు గ్రౌండింగ్ చేసే విధంగా ఆదేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద జిల్లాలో ఇప్పటికే 353 రైతుభరోసా కేంద్రాల్లో కస్టమ్ హయ్యరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీలు) ఏర్పాటు చేశారు. మిగిలిన 113 ఆర్‌బీకేల్లో సీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలని సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలకు వ్యవసాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. మార్చి 3వ తేదీ లోపు కర్నూలు సబ్‌డివిజన్‌లో 21, డోన్ సబ్‌డివిజన్ పరిధిలోని 19, ఆదోని సబ్‌డివిజన్‌లో 20, ఎమ్మిగనూరు సబ్‌డివిజన్‌లో 6, ఆలూరు సబ్‌డివిజన్‌లో 25, పత్తికొండ సబ్‌డివిజన్‌లో 22 ప్రకారం సీహెచ్‌సీలు ఏర్పాటు కానున్నాయి. ఇందు కోసం ఐదుగురు రైతులతో రైతుమిత్ర గ్రూపులు ఏర్పాటు చేసి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఖాతాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా 2022–23 సంవత్సరానికి సంబంధించి ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్ ధరలను గుంటూరులోని వ్యవసాయ శాఖ కమిషనరేట్ అధికారులు ఖరారు చేశారు.

మల్టీక్రాప్ థ్రెసర్స్, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్, రోటావేటర్, లెవలింగ్ బ్లేడ్స్ తదితర యంత్ర పరికరాల ధరలను జిల్లా స్థాయిలోనే జేసీ ఆధ్వర్యంలోని కమిటీ ఖరారు చేసింది. యూనిట్ ధర రూ.15లక్షలు ఉండగా, ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తోంది. సబ్సిడీని రైతుమిత్ర గ్రూపుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ప్రభుత్వమే జమ చేస్తోంది.

5న ఏపీ జేఏసీ అమరావతి 3వ రాష్ట్ర మహాసభలు

కర్నూలు కల్చరల్: ఏపీ జేఏసీ అమరావతి 3వ రాష్ట్ర మహాసభలు ఈనెల 5న కర్నూలులో నిర్వహిస్తున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్‌లోని పొదుపు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక.. 5న నగర శివారులోని జీఆర్‌సీ కన్వెన్షన్‌లో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. కార్యవర్గ సమావేశంలో అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలపై ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి వై.వి.రావు, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ గిరికుమార్‌రెడ్డి, అసోసియేట్ చైర్మన్ టి.వి. ప్రవీణ్‌రాజు, కోశాధికారి మురళీకృష్ణ నాయుడు, కో చైర్మన్ మల్లేశ్వరరావు, ఏపీపీటీడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరరావు, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

డోన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: డోన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకం కింద మొదటి విడత పైలెట్ ప్రాజెక్టుగా మండలంలోని అంబాపురం గ్రామాన్ని ఎంపిక చేసి రీ సర్వే పూర్తి చేశారు. శుక్రవారం గ్రామంలో 355 మంది రైతులకు 1193.738 ఎకరాలకు సంబంధించి డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జెడ్పీటీసీ శివలక్ష్మమ్మ చేతుల మీదుగా శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి రికార్డులను టీడీపీ హయాంలో తప్పుల తడకగా మార్చడంతో అంతటా భూ వివాదాలు పెరిగాయన్నారు. ప్రతి రైతుకు శాశ్వత భూ హక్కు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో తీవ్రమైన తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి రూ.330 కోట్లతో చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. శ్రీమద్దిలేటి నరసింహ స్వామి క్షేత్రంలో రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పేద వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నా టీడీపీ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లీనిక్‌ల ఏర్పాటు సరికొత్త పాలనకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పాల్గొన్నారు.

బీఎడ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వేణుగోపాల్

కర్నూలు(సిటీ): ప్రభుత్వ బీఎడ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వేణుగోపాల్‌ను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఈయనను ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులో నియమించారు. అయితే సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ పోస్టులో ఎవరినీ నియమించలేదు.

మట్కా డాన్ అసదుల్లా అరెస్ట్

కర్నూలు: మట్కా డాన్ అసదుల్లాను మరోసారి పోలీసులు అరెస్టు చేశారు. ఈయన కొన్నేళ్లుగా జిల్లాలో మట్కా నిర్వహిస్తూ రెండుసార్లు జిల్లా బహిష్కరణకు, రెండుసార్లు పీడీ కేసులో కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించాడు. దాదాపు 50కి పైగా జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి. అయినప్పటికీ మట్కా నిర్వహణ కొనసాగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో శుక్రవారం మధ్యాహ్నం ఇంటిపై నిఘా వేసి అసదుల్లాతో పాటు మట్కా బీటర్ దస్తగిరమ్మను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి అరకిలో ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తబ్రేజ్ తెలిపారు.

క్లుప్తంగా

కర్నూలులో కల్యాణ్ రామ్ సందడి



అభివాదం చేస్తున్న కల్యాణ్‌రామ్

కర్నూలు కల్చరల్: సినీ హీరో నందమూరి కల్యాణ్‌రామ్ కర్నూలులో సందడి చేశారు. కల్యాణ్‌రామ్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన అమిగోస్ సినిమా ట్రైలర్ లాంచ్ శుక్రవారం కర్నూలు శ్రీరామ థియేటర్‌లో నిర్వహించారు. కల్యాణ్ రామ్ మాట్లాడుతూ ఈనెల 10న సినిమా విడుదల కానుందన్నారు. అన్ని అంశాలతో అన్ని హంగులతో చిత్రం తెరకెక్కిందని, ప్రేక్షకులను తప్పక అలరిస్తుందన్నారు. త్వరలో నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు జూనియర్ ఎన్టీఆర్ హాజరవుతారన్నారు. సినిమా ప్రొడ్యూసర్ రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

నంద్యాల(రూరల్): మురికికుంట నుంచి వచ్చిన దుర్వాసనతో పాఠశాలలోని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన నంద్యాల మండలం పోలూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని సెంయిట్ జాన్ పాఠశాల వెనుక 50 సెంట్ల ప్రభుత్వ స్థలంలో మురికి కుంట ఉంది. ఆ పక్కనే పశు గ్రాసం సాగు చేసిన రైతు ఓబులేసు శుక్రవారం పొలానికి మురికి కుంట నుంచి మోటారు ద్వారా నీటిని మళ్లించాడు. ఆ సమయంలో దుర్వాసన రావడంతో పాఠశాలలో 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే పాఠశాల కరస్పాండెంట్ యోహాన్ 108 వాహనంలో విద్యార్థులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారి ఆరోగ్యం కుదుట పడటంతో ఇంటికి పంపించారు.

ప్రతి రోజూ 'స్పందన' నిర్వహించాలి

కల్లూరు: గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని గ్రామ,వార్డు సచివాలయాల కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి పి.బాలకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నటేకూరు, బస్తిపాడు గ్రామ సచివాలయలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.



కర్నూలు పెద్దాసుపత్రి ప్రాంగణంలో పూర్తికావొస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం

క్యాన్సర్ రోగులకు 'ఆరోగ్య' అభయం

- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స
- 2019 నుంచి 1,65,872 మందికి అందిన వైద్యం
- మొత్తం రూ.393 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- పెద్దాసుపత్రిలో శరవేగంగా పూర్తవుతున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్
- నేడు ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినం

కర్నూలు(హాస్పిటల్): ఒకప్పుడు క్యాన్సర్ వచ్చిందంటే చాలా భయపడి పోయేవారు. ప్రాణాలపై ఆశలు వదులుకునే వారు. నేడు ఆ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్‌ను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదలకు ఖరీదైన వైద్యం అందుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్, నంద్యాలలోని శాంతిరామ్ హాస్పిటల్‌లలో క్యాన్సర్ వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ క్యాన్సర్ కణతులు తొలగించేందుకు నిర్వహించే శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. 2019 నుంచి 2022 వరకు మెడికల్ ఆంకాలజీలో 60,324 మంది, సర్జికల్ ఆంకాలజీలో 52,723 మంది, రేడియేషన్ ఆంకాలజీలో 52,825 మంది ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స తీసుకున్నారు. ఈ మేరకు మొత్తం రూ.393 కోట్లు ఆయా ఆసుపత్రులు క్లెయిమ్ చేసుకున్నాయి. క్యాన్సర్‌కు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకుని డిశ్చార్జ్ అయిన రోగులకు ఆసరా పథకం కింద రోజుకు రూ.225, నెలకు రూ.5వేలు తక్కువ గాకుండా ప్రభుత్వం అందిస్తోంది.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆధునిక సౌకర్యాలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్మిస్తున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం పూర్తికావస్తోంది. మార్చి నాటికి భవనం పూర్తి కానుండగా అందులో అవసరమైన పరికరాలు మరో ఐదు నెలల్లో రానున్నాయి. రూ.120 కోట్లతో 120 పడకల సామర్థ్యంతో నిర్మించనున్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక లీనియర్ ఆక్సలరేటర్(రేడియేషన్ మిషన్), ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, బ్రాచి థెరపీ హెచ్‌డిఆర్(నేరుగా క్యాన్సర్ కణితిపై రేడియేషన్ ఇస్తారు), సీటీ సిమిలేటర్, ప్రత్యేకంగా రేడియాలజీ విభాగం, పెథాలజీ, మైక్రోబయాలజీ విభాగాల సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటితో పాటు రేడియేషన్ థెరపిస్ట్, మెడికల్ రేడియేషన్, సర్జికల్ రేడియేషన్, సర్జికల్ ఆంకాలజిస్ట్, పీడియాట్రిక్ సర్జరీ పోస్టులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి సిబ్బంది నియమితులవుతారు. దీంతో రాష్ట్రస్థాయిలో ఇక్కడే అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు ఇక్కడ అందనున్నాయి.

చికిత్స కోసం ఆసుపత్రులకు..

ఆధునిక వైద్యసౌకర్యాలు, ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించే అవకాశాలు రావడంతో చాలా మంది చికిత్స కోసం ఆసుపత్రులకు వస్తున్నారు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ విభాగం

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిరోజూ 10 మంది కొత్తవారు, 15 మంది పాత రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో రోజూ 10 నుంచి 15 మందికి కీమోథెరపి, 25 మందికి రేడియోథెరపీ చేశారు. ఈ విభాగంలో ఎప్పుడూ 60 నుంచి 80 మంది దాకా రోగులు చేరి చికిత్స తీసుకుంటున్నారు. వీరితో పాటు నగరంలోని ఒమెగా హాస్పిటల్, విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌లలోనూ క్యాన్సర్ చికిత్స అందిస్తున్నారు. ఇక్కడికి ప్రతిరోజూ 150 నుంచి 200 మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తున్నారు.

భయం అవసరం లేదు



క్యాన్సర్ ఉందనగానే భయపడటం సహజమే. అయినా అది పరిష్కారం కాదు. వ్యాధి లక్షణాలు, తీవ్రత, చికిత్సపై సరైన అవగాహన చేసుకుని ధైర్యంగా ముందుకువెళితే జీవితకాలం పెంచుకోవచ్చు. క్యాన్సర్ రాకుండా ఉండాలంటే మేలైన జీవనశైలి ముఖ్యం. ఆ విషయాన్ని చాటడానికే ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కేవలం ఉత్సవాలకే పరిమితం గాకుండా ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుంటే మన ఆరోగ్యంతో పాటు ఇతరులనూ రక్షించిన వాళ్లమవుతాం.

–డాక్టర్ ఎస్.జె.జానకిరామ్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, జీఐ ఆంకాలజీ, కర్నూలు

అవగాహన కలిగి ఉండాలి



క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. పురుషుల్లో నోటి క్యాన్సర్, మహిళల్లో గర్భాశయ ముఖ ద్వార, రొమ్ము క్యాన్సర్‌లు వస్తున్నాయి. ముందుగా గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. ఆలస్యమైతే మాత్రం చికిత్స కూడా కష్టం అవుతుంది. క్యాన్సర్‌తో పోరాడుతూ జీవిత చరమాంకంలో చివరి రోజులు గడుపుతున్న వారి కోసం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పాలియేటివ్ కేర్ ద్వారా బాధారహిత చికిత్స అందిస్తున్నాం. ఇప్పటిదాకా 2వేల మందికి పైగా బాధితులకు ఉచితంగా ఇక్కడ చికిత్స అందించాం.

–డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, హెచ్‌వోడీ, క్యాన్సర్ విభాగం, జీజీహెచ్, కర్నూలు

అన్ని రకాల క్యాన్సర్‌లకు ఉచిత చికిత్స



ఆరోగ్యశ్రీ పథకంలో అన్ని రకాల క్యాన్సర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోంది. ఈ మేరకు జిల్లాలోని అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యులు చికిత్స చేస్తున్నారు. వ్యాధిలక్షణాలున్న వారు వెంటనే సంబంధిత ఆసుపత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవచ్చు. ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు. క్యాన్సర్ చికిత్స ప్రైవేటులో ఎంతో ఖరీదైనది. కొన్నిసార్లు చికిత్సకు లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. ఆరోగ్యశ్రీలో దీనిని చేర్చడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడుకుంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు కూడా తొలగుతున్నాయి.

–డాక్టర్ రఘు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

క్యాన్సర్ వ్యాధికి కారణాలు

క్యాన్సర్ వ్యాధి రావడానికి 4 శాతం జన్యుపరంగా, 6 శాతం తీసుకునే నీరు, ఆహారం, 15 శాతం స్థూలకాయం (రొమ్ము, గర్భాశయం, పేగు, మూత్రపిండాల క్యాన్సర్లు), 40 శాతం పొగాకు (నోరు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌లు), 10 శాతం ఇన్‌ఫెక్షన్లు (హెచ్‌పీవీ, హెపటైటిస్ బి వల్ల వచ్చే కాలేయ క్యాన్సర్) కారణం. మిగిలిన 25 శాతం క్యాన్సర్ల (రక్తం, ఎముక, ప్యాంక్రియాస్‌ల క్యాన్సర్)లకు సరైన కారణాలు లేవు.

నివారణ మార్గాలు

- ధూమపానం, మద్యపానం మానేయాలి.
- పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి.
- ప్రతిరోజూ 4 నుంచి 5 లీటర్ల నీరు తాగాలి.
- హెచ్‌పీవీ, హెపటైటిస్ బి టీకాలు వేయించుకోవాలి.
- పండ్లు, ఆకుకూరలు తినాలి.
- పొట్టేలు మాంసం తగ్గించాలి. చేపలు, కోడి మాంసం తినాలి.
- స్థూలకాయం తగ్గించుకోవాలి. ప్రతి రోజూ వ్యాయామం చేయాలి.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని కుడా(కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణంతో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి, ఎంపీపీ గాడి రూతమ్మ, కాంట్రాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, నాయకులు మద్దిలేటి, గిరి బాబు, వెంకటశివుడు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల భూమి పూజలో పాల్గొన్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

మార్చి 7 నాటికి 'ఈ-క్రాప్' పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): రబీ పంటల నమోదు ప్రక్రియ మార్చి 7వ తేదీ నాటికి పూర్తి చేసి తుది జాబితా ప్రకటించేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. కర్నూలు జిల్లాలో 2.18 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగు కాగా.. 95 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయింది. నంద్యాల జిల్లాలో 3.41 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా.. 94 శాతం ఈ-క్రాప్ నమోదు చేశారు. ఇదేసమయంలో వీఏఏ, వీఆర్‌వో అథెంటికేషన్‌తో పాటు రైతులతో ఈ-కేవైసీ చేయించడం చురుగ్గా సాగుతోంది. కర్నూలు జిల్లాలో ఈ-కేవైసీ 27 శాతం, నంద్యాల జిల్లాలో 24 శాతం పూర్తయింది. తాజా షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20 నాటికి పంటల నమోదు పూర్తి చేయాల్సి ఉంది. ఈ నెల 21 నుంచి 28 వరకు ఆర్‌బీకే వారీగా పంటల నమోదు వివరాలను సోషల్ ఆడిట్‌కు పెట్టి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. మార్చి నెల 1 నుంచి 5వ తేదీ వరకు అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరిస్తారు. మార్చి నెల 7న తుది జాబితా ప్రచురిస్తామని డీఏఓ పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

ఆలూరు ఎంపీపీగా రంగమ్మ



ఎంపీపీ రంగమ్మను అభినందిస్తున్న మంత్రి సోదరులు శ్రీనివాసులు, నారాయణ స్వామి



కట్టుబడి బీబీకి నియామకపత్రం అందజేస్తున్న ప్రత్యేక అధికారి డీఎం ఖాన్

కర్నూలు(అర్బన్)/ఆలూరు/ఆలూరు రూరల్: ఆలూరు మండల అధ్యక్షురాలిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కమ్మరచేడు ఎంపీటీసీ సభ్యురాలు రంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలూరు ఎంపీపీ బూర్ల సుభాషిణి (50) అనారోగ్యం కారణంగా గత ఏడాది ఆగస్టు 24న మృతి చెందడంతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఎంపీపీ అభ్యర్థిగా రంగమ్మ నామినేషన్ ఒక్కటే దాఖలవడంతో 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగమ్మను కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున రెడ్డి, మండల కన్వీనర్ వీరేష్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిన్న ఈరన్న అభినందించారు.

ఎమ్మిగనూరు వైస్ ఎంపీపీగా సుశీలమ్మ

ఎమ్మిగనూరు వైస్ ఎంపీపీగా కలుగొట్ల ఎంపీటీసీ సభ్యురాలు సుశీలమ్మను ఎన్నుకున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలూరు ఎంపీపీ, ఎమ్మిగనూరు వైస్ ఎంపీపీ, మద్దికెర కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి గత నెల 28న రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈమేరకు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశామన్నారు.

మద్దికెర : మండల కో ఆప్షన్ సభ్యురాలిగా కట్టుబడి బీబీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ప్రత్యేక అధికారి డీఎం ఖాన్ తెలిపారు. మండల కో ఆప్షన్ సభ్యుడు పెద్దమస్తాన్ గతేడాది ఏప్రిల్ 22వ తేదీన మృతి చెందడంతో ఈ ఎన్నిక నిర్వహించినట్లు చెప్పారు. కట్టుబడి బీబీ ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయ్యిందని తెలిపారు.

అదనపు కట్నం వేధింపులతో మహిళ ఆత్మహత్య



వినీల (ఫైల్)

కర్నూలు: అదనపు కట్నం వేధింపులతో కర్నూలుకు చెందిన వినీల(28) ఆత్మహత్య చేసుకుంది. ఈమె భర్త చిరంజీవి జిల్లా పోలీసు శాఖ స్పెషల్ బ్రాంచ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వినీల తండ్రి నాగన్న కూడా పోలీసు శాఖలో ఎస్ఐగా పని చేసి పదవీ విరమణ పొందారు. నాగన్న కుటుంబం బళ్లారి రోడ్డులోని ఆదిత్య నగర్‌లో నివాసముండగా, అల్లుడు చిరంజీవి భార్యతో కలసి నగర శివారులోని ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి పదేళ్ల క్రితం వివాహమైంది. ఆ సందర్భంగా రూ.2 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. మధ్యలో మరో రూ.3 లక్షలు ముట్టజెప్పారు. అయినప్పటికీ అదనపు కట్నం కోసం చిరంజీవి భార్యను వేధిస్తుండటంతో భరించలేక గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కొక్కేనికి చీరతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. తండ్రి నాగన్న ఫిర్యాదు మేరకు చిరంజీవితో పాటు ఆయన తల్లి శేషమ్మ, సోదరి ఆనందమ్మ, బావ గిడ్డయ్య, సోదరుడు మద్దిలేటిలపై కేసు నమోదు చేసినట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

బ్యాట్ ఝుళిపిస్తూ.. బౌండరీలు దాటిస్తూ!

- రెండో రోజు రసవత్తరంగా సాగిన సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు



సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీల్లో రెండో రోజు తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): నగరంలోని వైద్య కళాశాల క్రీడా మైదానంలో సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు రెండోరోజు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. నిర్ణీత 10 ఓవర్లలో వివిధ జట్లకు చెందిన క్రికెటర్లు బ్యాట్‌ను ఝుళిపించారు. బంతిని బౌండరీలు దాటించారు. ఫోర్లు, సిక్సర్లతో అలరించారు. రెండోరోజు మొదటి మ్యాచ్ శంకరాస్ డిగ్రీ కళాశాల, రాయలసీమ యూనివర్సిటీ జట్ల మధ్య జరిగింది. టాస్ నెగ్గి శంకరాస్ డిగ్రీ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేసింది. స్కోర్ తక్కువగా ఉన్నా విజయం కోసం రాయలసీమ యూనివర్సిటీ జట్టు శ్రమించాల్సి వచ్చింది. మొత్తం 8.3 ఓవర్లు ఆడి 7 వికెట్లు నష్టానికి 51 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్ జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ ఎంచుకుని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. జట్టులో యోగిబాబు అత్యధికంగా 26 పరుగులు చేశారు. ఆ తరువాత ప్రత్యర్థి జట్టు 10 ఓవర్లు ఆడి 4 వికెట్లు కోల్పోయి 70 పరుగులు చేసి చేతులెత్తేసింది. దీంతో జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. మూడో మ్యాచ్ సెయింట్ జాన్స్ డిగ్రీ కళాశాల, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో సెయింట్ జాన్స్ డిగ్రీ కళాశాల జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 6 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. 71 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఆళ్లగడ్డ కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల జట్టు 5.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి విజయం సాధించింది. జట్టులో తేజ 7 ఫోర్లు, ఒక సిక్స్ కొట్టి 39 పరుగులు చేశారు. మరో బ్యాట్స్‌మెన్ రవిశేఖర్ 4 ఫోర్లు కొట్టి 23 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించాడు.







రెండో రోజు పోటీల్లో గెలుపొందిన రాయలసీమ యూనివర్సిటీ జట్టు, పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ జట్టు , కేవీ సుబ్బారెడ్డి కళాశాల జట్టు



వైడ్ బాల్ సిగ్నల్ ఇస్తూ..



ఈలలు వేసి ఉత్సాహపరుస్తూ..



వికెట్ తీసేలా బౌలింగ్ చేస్తూ..



ఔట్‌కు అప్పీల్ చేస్తూ..